క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 12న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. చైతన్యపురి కాలనీ, బ్యాంక్ కాలనీ, టీచర్స్ కాలనీ -1 ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, గోపాల్‌పూర్ కల్లు మండువా, ఎఫ్‌సీఐ కాలనీ, శివసాయి కాలనీ, విద్యాధరి స్కూల్, వెంకటేశ్వర కాలనీ, అరుణోదయ కాలనీ, బృందావన్ కాలనీ ప్రాంతాల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రాష్ట్ర స్థాయి విజేతలకు సన్మానం



హన్మకొండ అర్బన్: ఇటీవల భువనగిరిలో నిర్వహించిన 68వ ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి కబడ్డీ అండర్ -17 పోటీల్లో విజేతలుగా నిలిచిన జట్టు సభ్యులు, హుస్నాబాద్‌లో జరిగిన హ్యాండ్‌బాల్ అండర్ -14 బాయ్స్ విజేతలు, రన్నర్స్ జట్టులోని బాలికల క్రీడాకారులు, కోచ్‌లు, పీడీలను హనుమకొండ కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రావీణ్య, డీఈఓ వాసంతి సోమవారం సన్మానించారు. కార్యక్రమంలో పీడీలు ప్రభాకర్‌రెడ్డి, గ్రీష్మ, సునీల్, రాజేశ్వరి, అరుణ్, వెంకటేశ్వర్లు, బాలమురళీకృష్ణ, శ్రీధర్, రాముడు, కుమారస్వామి, రాజు, కిషన్, దేవేందర్, కైలాష్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

కరాటేలో రైల్వే టెక్నీషియన్ ప్రతిభ



కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే ఎలక్ట్రిక్ లోకోషెడ్‌లో సీనియర్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న ఎస్ఎస్‌కేఏఐ గ్రాండ్‌మాస్టర్ నాయిని సదానందంకు కరాటేలో 8వ డాన్ జపాన్ డిప్లమా ప్రదానం చేశారు. గోవా నగరంలో ఈనెల 10వ తేదీన నిర్వహించిన పునకోసి షోటోకాన్ కరాటే ట్రెనింగ్ అండ్ గ్రేడింగ్ టెస్ట్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి సదానందం పాల్గొన్నారు. జపాన్ గ్రాండ్ మాస్టర్ కెవిన్ పునకోసి బృందం సమక్షంలో సదానందంను అభినందించి జపాన్ డిప్లమా అందజేశారు.

చంద్రపూర్ ఎన్నికల పరిశీలకుడిగా రామకృష్ణ



హన్మకొండ చౌరస్తా: మహారాష్ట్రలోని చంద్రపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ పక్షాన ఎన్నికల పరిశీలకుడిగా హనుమకొండ జిల్లా కాంగ్రెస్ ఎస్సీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ నియమితులయ్యారు. ఈమేరకు ఆయనకు ఏఐసీసీ ఎస్సీ డిపార్టుమెంట్ చైర్మన్ రాజేష్ లిలోథియా నియామక ఉత్తర్వులు జారీ చేశారు.

విద్యార్థులకు సన్మానం



న్యూశాయంపేట: వరంగల్ శంభునిపేట బాలికల (2) గురుకులంలో ఖురాన్ పూర్తిచేసిన 30మంది విద్యార్థులను సన్మానించారు. అలాగే, వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు 37వ డివిజన్ కార్పొరేటర్ బోగి సువర్ణ, ప్రిన్సిపాల్ టి.నీలిమా దేవి బహుమతులు ప్రదానం చేశారు.

సర్వే పత్రాన్ని మార్చాలి

కాశిబుగ్గ సెంటర్: సమగ్ర కుటుంబ సర్వేలో 21రకాల వైకల్యాలకు చోటు లేదని, కోడ్‌లు లేకుండా ముద్రించిన సర్వే పత్రాన్ని వెంటనే మార్చాలని నవ తెలంగాణ దివ్యాంగుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ.అజీమ్ కోరారు. ఈమేరకు వికలాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ బి.శైలజకు మెయిల్ ద్వారా సోమవారం వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు.

హైకోర్టు న్యాయవాదిగా రేవతి



కాజీపేట రూరల్: కాజీపేట బాపూజీనగర్ అంబేడ్కర్ కాలనీకి చెందిన రేవతి కాందారి.. హైకోర్టు న్యాయవాదిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హైకోర్టు న్యాయవాదిగా ప్రజలకు, మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించేందుకు, న్యాయ సలహాలు అందించేందుకు కృషి చేస్తానని అన్నారు.

అధికారులపై దాడి హేయం

ఫార్మా కంపెనీ భూసేకరణ ప్రక్రియలో భాగంగా వికారాబాద్ జిల్లా, దుద్యాల మండలం, లగచర్ల గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ప్రజాభిప్రాయ సేకరణకు వచ్చిన కలెక్టర్, అదనపు కలెక్టర్, ప్రత్యేక కార్యదర్శి, తహసీల్దార్, రెవెన్యూ అధికారులు, సిబ్బందిపై దాడి చేయడం హేయమైన చర్య అని నగరంలో పలువురు విమర్శించారు. ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. దాడికి పాల్పడిన వారిపై కేసులు పెట్టి శిక్షించాలని కోరారు.

- సాక్షి నెట్‌వర్క్

అధికమవుతున్న కుక్కల బెడద





కాజీపేటలోని వీధుల్లో గుంపులుగా సంచరిస్తున్న వీధి కుక్కలు

కాజీపేట: కాజీపేట పట్టణ శివారు కాలనీల్లో నానాటికి కుక్కల బెడద పెరిగిపోతోంది. దాంతో ప్రజలు నిత్యం భయంతో వణికిపోతున్నారు. ఇటీవలి కాలంలో ఏ గల్లీలో చూసినా పదుల సంఖ్యలో కుక్కలు దర్శనిమిస్తున్నాయి. చిన్నా, పెద్ద అనే తేడా లేకుండా మనుషులపై దాడి చేసి కరుస్తున్నాయి. ఇటీవల కాలంలో ఆరుగురు వ్యక్తులపై కుక్కలు దాడిచేసి గాయపర్చడం పట్టణంలో చర్చనీయఅంశంగా మారింది. రాత్రి వేళల్లో నడిచి వెళ్లేవారిపై, ద్విచక్ర వాహనాలపై కుక్కలు వెంటపడి దాడులు చేస్తున్నాయి. మున్సిపల్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి కుక్కలను ఇక్కడ నుంచి తరలించాలని, వాటి బాధ నుంచి తమను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

రాష్ట్రస్థాయి క్రీడాపోటీల్లో విద్యార్థుల ప్రతిభ



హసన్‌పర్తి: ప్రతిభ కనబర్చిన విద్యార్థులు



క్రీడాకారులను అభినందిస్తున్న నిర్వాహకులు

హసన్‌పర్తి: రాష్ట్రస్థాయి వుషు చాంపియన్ షిప్ పోటీల్లో హసన్‌పర్తి మండలం పెంబర్తిలోని ఇండియన్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈనెల 9, 10వ తేదీల్లో రంగారెడ్డి జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ -14 వుషు పోటీల్లో పాఠశాలకు చెందిన ప్రతీక్, లుక్‌మన్, సాయిచరణ్, అక్షిత్, హర్షిత్ ప్రతిభ కనబరిచి రజత, కాంస్య పతకాలు సాధించారని పాఠశాల కరస్పాండెంట్ అజ్మీర రమేష్ వివరించారు. ఈ సందర్భంగా పాఠశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను ప్రిన్సిపాల్ ప్రియాంక, ఏఓ కార్తీక్, ఇన్‌చార్జ్ వెంకటేశ్వర్లు, పీఈటీ నరసింగారావు, నాగేంద్రబాబు, ఉపాధ్యాయులు అభినందించారు.

కరాటే పోటీల్లో క్రీడాకారులకు పతకాలు

హన్మకొండ: గోవాలోని ముపుసాలో జరిగిన 24వ ఎఫ్ఎస్‌కేఏ ప్రపంచ కప్ కరాటే ఛాంపియన్ షిప్-24లో హనుమకొండ నయీంనగర్‌కు చెందిన క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబర్చి బంగారు, రజత, కాంస్య పతకాలు సాధించారు. నవంబర్ 7 నుంచి 10 వరకు గోవాలోని ముపుసాలోని స్పోర్ట్స్ క్లబ్ ఇండోర్ స్టేడియంలో ఈ ప్రపంచ కప్ పోటీలు జరిగాయి. రాష్ట్రం నుంచి వివిధ వయస్సు, బరువు కేటగిరీలో 125 మంది పాల్గొన్నారు. హనుమకొండ నయీంనగర్ ఛాంపియన్స్ కరాటే అకాడమీకి చెందిన పొన్న యశ్వంత్ 14 ఏళ్లలోపు 40 కిలోల బరువు విభాగంలో కుమితే ఈవెంట్‌లో బంగారు పతకాన్ని, కటా ఈవెంట్‌లో సిల్వర్ మెడల్ సాధించాడు. 14 ఏళ్లలోపు, 60 కిలోల బరువు విభాగంలో పొన్న ఆదిత్య కుమితే ఈవెంట్‌లో రజత పతకం, కటా ఈవెంట్‌లో కాంస్య పతకం, 21 సంవత్సరాల్లోపు 75 కిలోల బరువు విభాగంలో రెడ్డబోయిన భరత్ కుమితే ఈవెంట్‌లో బంగారు, కటా ఈవెంట్‌లో కాంస్య పతకం సాధించారు. ఈమేరకు వారికి పలువురు అభినందనలు తెలిపారు.

‘మల్లికాంబ’కు ఎన్పీడీసీఎల్ విరాళం



విరాళం అందిస్తున్న ఎస్ఈ వెంకటరమణ

హన్మకొండ: హనుమకొండ బాలసముద్రంలోని మల్లికాంబ మనోవికాస కేంద్రానికి టీజీ ఎన్పీడీసీఎల్ విరాళాన్ని అందించింది. మల్లికాంబ మనోవికాస కేంద్రంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఎన్పీడీసీఎల్ హనుమకొండ ఎస్ఈ కె.వెంకటరమణ రూ.20 వేల చెక్కును నిర్వాహకులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాథ, దివ్యాంగులు, వృద్ధాశ్రమాలకు చేయూతనందించేందుకు ఎన్పీడీసీఎల్ ఉద్యోగులు ప్రత్యేకంగా సహాయ నిధిని ఏర్పాటు చేసి ప్రతినెలా కొంత మొత్తాన్ని పోగు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ నవీన్, ఏడీఈ మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు.

హైబ్రిడ్ స్కూల్‌గా కుమ్మరిగూడెం పాఠశాల



డిజిటల్ క్లాస్ రూంను ప్రారంభిస్తున్న శౌరిరెడ్డి

కాజీపేట అర్బన్: కాజీపేట మండలంలోని కుమ్మరిగూడెం ప్రభుత్వ పాఠశాలను హైబ్రిడ్ స్కూల్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు బాలవికాస సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సింగారెడ్డి శౌరిరెడ్డి తెలిపారు. పాఠశాలలో బాలవికాస ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన రెండు డిజిటల్ క్లాస్ రూంలను బాలవికాస ఆయన ప్రారంభించి మాట్లాడారు. 18 ఏండ్లుగా 550 ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి బాలవికాస కృషి చేస్తోందని వివరించారు. ఒంటి మామిడిపల్లి తరహాలో కుమ్మరిగూడెం ప్రభుత్వ పాఠశాలను హైబ్రిడ్ స్కూల్‌గా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ నాగేశ్వర్‌రావు, ఎంఈఓ మనోజ్‌కుమార్, ఎర్రబెల్లి ఉపేందర్, మాజీ సర్పంచ్ రమేష్, వల్లంపట్ల నాగేశ్వర్‌రావు, ప్రధానోపాధ్యాయుడు రవీందర్, బాలవికాస ఐటీ మేనేజర్ శివరామ్, విద్యాకమిటీ చైర్‌పర్సన్ కల్వచర్ల నవత, సభ్యురాలు అరూరి కవిత తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ఖిలా వరంగల్: కుటుంబ కలహాలతో మనస్థాపం చెందిన ఓ వ్యక్తి అద్దెకుంటున్న ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సోమవారం వరంగల్ శంభునిపేటలో వెలుగులోకి వచ్చింది. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం అనంతారం గ్రామానికి చెందిన తౌటి రవీందర్ (46)కు ఇద్దరు భార్యలు కమల, నాగమణి ఉన్నారు. కట్టుకున్న భార్యలు, కుమారులు దూరమవడంతో అనారోగ్య సమస్యలతో మనస్థాపం చెందిన రవీందర్ ఆదివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

బావిలో వృద్ధురాలి మృతదేహం లభ్యం

హసన్‌పర్తి: బావిలో ఓ వృద్ధురాలి మృతదేహం లభ్యమైంది. ఈ ఘటన హసన్‌పర్తి మండలం వంగపహాడ్‌లో చోటు చేసుకుంది. వంగపహాడ్‌కు చెందిన కోమల లచ్చమ్మ(97)కు కుమారుడు, కూతురులు ఉన్నారు. అయితే కొంతకాలంగా లచ్చమ్మ మనోవేదనకు గురవుతోంది. ఈక్రమంలో సోమవారం ఇంటి ఆవరణలో ఉన్న బావిలో ఆమె మృతదేహం లభ్యమైంది. ఈ ఘటనపై మృతురాలి కోడలు భాగ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సిద్దయ్య తెలిపారు. కాగా, లచ్చమ్మ మానసిక వేదనకు గురై బావిలో దూకినట్లు మృతురాలి మనవడు పీసం కోమల్‌రెడ్డి తెలిపారు. కాగా, వృద్ధురాలి మృతిపై వివరాలు తెలియాల్సి ఉంది.

గుర్తుతెలియని మృతదేహం

వరంగల్: దేశాయిపేట మద్దెలకుంట కల్వర్టు పక్కన ఉన్న కుంటలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు సమాచారం మేరకు మున్సిపల్ జవాన్ సాంబయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఇంతేజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ షుకుర్ తెలిపారు. ఆ మృతదేహాన్ని ఎంజీఎంలోని మార్చురీలో భద్రపర్చినట్లు పేర్కొన్నారు. 87126 85007, 87126 85118 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

వ్యక్తి అదృశ్యం

వరంగల్: గిర్మాజీపేట మార్కండేయ టెంపుల్ వీధికి చెందిన అడ్డగట్ల వెంకటేశ్వర్లు(60) ఈనెల 5న రాత్రి 8 గంటలకు ఇంటి నుంచి చెప్పకుండా వెళ్లిపోయాడు. సోమవారం వరకు తిరిగి రాలేదని అని అతడి కొడుకు రాజా ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇంతేజార్‌గంజ్ సీఐ షుకుర్ తెలిపారు.

వృద్ధుడి అదృశ్యం

వరంగల్: వరంగల్ నిజాంపురాకు చెందిన ఎండీ ఖాజామియా(70) 10వ తేదీ పెరుగు తెచ్చుకుంటానని ఇంటి నుంచి వెళ్లి తప్పిపోయినట్లు ఇంతేజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్‌షుకుర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈఘటనపై ఖాజామియా కుమారుడు మస్తాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుట్కా ప్యాకెట్లు స్వాధీనం

వరంగల్: వరంగల్ ఏనుమాముల పోలీసుస్టేషన్ పరిధిలోని కీర్తినగర్‌లోని కిరాణ వ్యాపారి గోపగాని చందు కిరాణ దుకాణంలో విక్రయిస్తున్న రూ.30,340ల విలువైన గుట్కాతో పాటు నిషేధిత పొగాకు ఉత్పత్తులను టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీధర్, ఏనుమాముల ఎస్సై పీ.శ్రీకాంత్ స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ ఒక ప్రకటనలో తెలిపారు. కేసును తదుపరి చర్యల నిమిత్తం ఏనుమాముల పోలీసు స్టేషన్‌కు అప్పగించినట్లు వివరించారు.

ప్లంబ్లింగ్ సామగ్రి చోరీ నిందితుల అరెస్ట్

వరంగల్: గత నెల 16వ తేదీన ఏనుమాముల 100ఫీట్ల రోడ్డు పుష్పరాజ్ కన్వెన్షన్ పక్కన ఉన్న శ్రీవైష్ణవి ట్రేడర్స్ శానిటరీ షాపులో గుర్తు తెలియని వ్యక్తులు సుమారు రూ.లక్షా 50వేల విలువైన పంబ్లింగ్ సామగ్రిని అపహరించారు. ఈషాపు యాజమాని యెలుగం సతీష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టగా కాశిబుగ్గకు చెందిన పల్లికొండ ఉపేందర్, కటకం ప్రణయ్ నిందితులుగా తేలిందని, వారిని అదుపులోకి తీసుకున్నట్లు ఏనుమాముల ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ తెలిపారు.

యోలా బస్సులో తనిఖీలు



కాజీపేట: కాజీపేట పట్టణంలో యోలా బస్సును ఆదివారం రాత్రి ఆపి ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు చేశారు. వరంగల్ పోచమ్మ మైదాన్ నుంచి బెంగళూరుకు వెళ్తున్న బస్సు కాజీపేట చౌరస్తాకు చేరుకోగానే ఆ బస్సును రైల్వే జంక్షన్ రోడ్డులో ట్రాఫిక్ సిబ్బంది ఆపారు. బస్సులో ఉన్న సిబ్బందిని కిందికి దించి అనుమతి ఉందో లేదో పరిశీలించి పలు ప్రశ్నలు సంధించారు. చాలాసేపు బస్సును ఆపడంతో ప్రయాణికులు అసహనం వ్యక్తంచేశారు. ఆల్ ఇండియా పర్మిట్ ఉందని యోలా కంపెనీ మేనేజర్ ట్రాఫిక్ పోలీసులకు తెలిపారు. ఆర్టీసీ అధికారుల ఫిర్యాదు మేరకే బస్సును ఆపినట్లు ట్రాఫిక్ సిబ్బంది స్పష్టం చేశారు. మరోమారు కాజీపేట బస్టాపులో యోలా బస్సును ఆపొద్దని హెచ్చరించి బస్సును ముందుకు పంపించారు.

కాజీపేట కార్మిక సంఘం ఎన్నిక



కాజీపేట: కాజీపేట పట్టణంలో శ్రీస్వామి వివేకానంద గృహ నిర్మాణ కార్మిక సంఘం నూతన కమిటీని సభ్యులు సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాజీపేట పట్టణ అధ్యక్షుడిగా కుంచం అయిలయ్య, ప్రధాన కార్యదర్శిగా అశోక్‌ను ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకులుగా తెలంగాణ భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తేలు సారంగపాణి, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఇమ్మడి రాజులు వ్యవహరించారు. కార్యక్రమంలో పాలడుగుల శివకుమార్, భిక్షపతి, జేరిపోతుల దేవేందర్, స్వామి, కాట్రాజు, ప్రేమ్‌కుమార్, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

దయ్యాలు వేదాలు వల్లించినట్లుంది

హన్మకొండ: బీసీ సామాజిక వర్గాలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడడం దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకట నారాయణ ఎద్దేవాచేశారు. హనుమకొండ బాలసముద్రంలోని తన స్వగృహంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారం కోల్పోయిన తర్వాత బీఆర్ఎస్ నేతలు బీసీల భజన చేయడం సిగ్గుచేటు అని విమర్శించారు. సమావేశంలో ఆయా సంఘాల నాయకులు సుధాకర్, గునిగంటి శ్రీనివాస్ గౌడ్, చెన్నూరి రమేష్, బగ్గి రాజు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

నేడు నీటి సరఫరాలో అంతరాయం

వరంగల్ అర్బన్: ధర్మసాగర్ రిజర్వాయర్ వద్ద 60ఎంఎల్‌డీ నీటి శుద్ధీకరణ కేంద్రం వద్ద టీజీఎన్పీడీసీఎల్ అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేస్తుండటంతో వరంగల్ అండర్ రైల్వే గేట్ ప్రాంతంలోని పలు ప్రాంతాలకు తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని బల్దియా ఈఈ శ్రీరామోజు శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నందున తాగునీటి శుద్ధీకరణపై ప్రభావం పడుతుందని పేర్కొన్నారు.

టెన్త్ వార్షిక పరీక్ష ఫీజు చెల్లించాలి

కాశిబుగ్గ సెంటర్: పదో తరగతి వార్షిక పరీక్షలకు విద్యార్థులు ఈనెల 18వ తేదీ వరకు ఫీజు చెల్లించాలని వరంగల్ డీఈఓ మామిడి జ్ఞానేశ్వర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కొత్త టీచర్లకు ఐడీ కేటాయించాలి

కాశిబుగ్గ సెంటర్: డీఎస్సీ -2024 ద్వారా వరంగల్ జిల్లాలోని నూతనంగా నియమితులైన ఉపాధ్యాయులకు ఎంప్లాయిస్ ఐడీని కేటాయించి సకాలంలో వారికి వేతనాలు ఇప్పించాలని వరంగల్ ఏటీఓ పరంజ్యోతికి టీఎస్‌యూటీఎఫ్ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి సి.సుజన్ ప్రసాదరావు ఆధ్వర్యంలో సోమవారం వినతిపత్రం అందజేశారు.

బంధన్ ఆస్పత్రిపై డీఎంహెచ్‌ఓకు ఫిర్యాదు

ఎంజీఎం: నగరంలోని బంధన్ ఆస్పత్రిలో తనకు జరిగిన అన్యాయంపై విచారణ చేసి న్యాయం చేయాలని నగరంలోని కరీమాబాద్‌కు చెందిన లింగబత్తిని కృష్ణ కోరారు. ఈమేరకు డీఎంహెచ్‌ఓ అప్పయ్యకు సోమవారం వినతిపత్రం అందజేశారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం అపెండిక్స్ సమస్యతో 2024, జూలై 21న బంధన్ ఆస్పత్రిలో చేరగా, ఆపరేషన్ చేసి పట్టించుకోకపోవడంతో హైదరాబాద్ బేగంపేట మెడికవర్ ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యారు. ఆపరేషన్ చేసిన చోట ఇన్ఫెక్షన్ ఎక్కువగా ఉందని మరో ఆపరేషన్ చేశారు. ఇప్పటి వరకు రూ.14 లక్షల ఖర్చుతో పాటు ఆరునెలల పాటు పూర్తిగా విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించినట్లు బాధితుడు కృష్ణ తెలిపారు. బంధన్ ఆస్పత్రి వైద్యుల కారణంగా తన ఆరోగ్యం పూర్తి క్షీణించిందని ఆయన ఆరోపించారు.

మార్బుల్స్, టైల్స్ కార్మికులను ఆదుకోవాలి

రామన్నపేట: ఇతర రాష్ట్రాల దుకాణదారులు, బిల్డర్ల కారణంగా స్వరాష్ట్రంలో తమకే పనిలేకుండా పోయిందని, క్రమంలో ప్రభుత్వం ఆదుకోని న్యాయం చేయాలని వరంగల్, హనుమకొండ జిల్లాల పాలీష్, మార్బుల్, గ్రెనైట్, స్టోర్, టైల్స్, పాలీష్ మెషీన్, ఫ్లోరింగ్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మహ్మద్ సమీర్ కోరారు. ఈమేరకు నగరంలోని మండిబజార్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు ఫిరోజ్, జాఫర్ అలీ, జనరల్ సెక్రటరీ అలీ బేగ్, జాయింట్ సెక్రటరీ తాజ్, జమీల్ పాల్గొన్నారు.

రైతాంగ శ్రేయస్సుకు పాటుపడ్డారు

వరంగల్ చౌరస్తా: ఆర్థిక, సామాజిక విశ్లేషకుడు, రైతాంగ ఉద్యమాల ప్రోత్సాహకుడు, రైతుల శ్రేయస్సు కోసం నిరంతరం పరితపించిన రిటైర్డ్ ప్రొఫెసర్ మరింగంటి యాదగిరి మరణం కర్షక, కార్మిక ఉద్యమాలకు తీరని లోటని అఖిల భారత రైతు సమాఖ్య (ఏఐకేఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్, ఏఐకేఎంఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు రాచర్ల బాలరాజు అన్నారు. వరంగల్ అండర్ బ్రిడ్జి సమీపంలోని ఓంకార్ భవన్‌లో ఏఐకేఎఫ్, ఏఐకేఎంఎస్ రైతు సంఘాల ఆధ్వర్యంలో ప్రొఫెసర్ మరింగంటి యాదగిరి చిత్రపటానికి పూలమాలలు వేసి సోమవారం నివాళులర్పించారు. మహమ్మద్ ఇస్మాయిల్ అధ్యక్షతన జరిగిన రైతు కార్మిక ప్రజా సంఘాల నాయకులు నర్ర ప్రతాప్, కన్నం వెంకన్న, సుంచు జగదీశ్వర్, ఐతం నాగేష్, ఇనుముల కృష్ణ, ఉడుత గణేష్, గజ్జల రాజు, సంతోష్, కొమురయ్య, తదితరులు పాల్గొన్నారు.

మార్వాడీ దోపిడీని అడ్డుకుందాం

హన్మకొండ: మార్వాడీ దోపిడీని అడ్డుకుని తెలంగాణ ఉనికిని కాపాడుకుందామని ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. మార్వాడి దోపిడీని అడ్డుకుందాం – తెలంగాణ ఉనికిని కాపాడుకుందాం అనే అంశంపై హనుమకొండ జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయం ఆవరణలోని పీఆర్‌టీయూ కార్యాలయంలో సోమవారం సదస్సు జరిగింది. ఈ సదస్సులో జైసింగ్ రాథోడ్, డాక్టర్ శంకర్ నారాయణ (లాల్ నీల్ మైత్రి), రామబ్రహ్మం, ఓం బ్రహ్మం (భారత్ బచావో), దూడల సాంబయ్య (అభ్యుదయ వాదుల వేదిక), సోమరామమూర్తి (తెలంగాణ ఉద్యమకారుడు), జిలకర శ్రీనివాస్ (విముక్త చిరుతల కచ్చి), సాయిని నరేందర్ (బీసీ ఐక్య వేదిక), అరుణక్క, కే.సురేందర్ (జేఎంఐ), రాజు నాయక్ (గోర్ సభ), నళిగంటి చంద్రమౌళి (తెలంగాణ ఉద్యమకారుడు) పాల్గొన్నారు.

కులగణన సర్వేను విమర్శించడం తగదు

కాజీపేట: ఎన్నికల సమయంలో ప్రజలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు కులగణన చేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు పెంచాలని ప్రయత్నిస్తుంటే బీఆర్ఎస్ నాయకులు విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని తెలంగాణ రాష్ట్ర వడ్డెర సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పల్లపు సమ్మయ్య ఎద్దేవా చేశారు. కాజీపేట మీడియా పాయింట్ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర యూత్ అధ్యక్షుడు బొంత మురళి, జిల్లా అధ్యక్షుడు బొంత అయిలయ్య, పల్లపు నవీన్, రాజు పాల్గొన్నారు.

మైనార్టీలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి

వరంగల్: మైనార్టీలు సామాజిక, ఆర్థిక రంగాల్లో అభివృద్ధి చెందాలని హజ్రత్ సయ్యద్ మహమ్మద్ బియ్యబానీ ఖాద్రీ అన్నారు. ఆరెపల్లి సమీపంలోని తెలంగాణ మైనార్టీ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకొని జాతీయ విద్యా దినోత్సవంతో పాటు మైనారిటీ సంక్షేమ దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు.

కార్మికుల సంక్షేమమే ధ్యేయం

కాశిబుగ్గ: కార్మికుల సంక్షేమం కోసం పోరాటం చేసేది మజ్దూర్ యూనియన్ మాత్రమే అని యూనియన్ సికింద్రాబాద్ డివిజనల్ సెక్రటరీ రవీందర్ అన్నారు. వరంగల్ రైల్వే స్టేషన్‌లో ట్రేడ్ యూనియన్ ఎన్నికల ప్రచారాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారం, సంక్షేమం కోసం రాజీలేని పోరాటం చేస్తున్న మజ్దూర్ యూనియన్‌ను కార్మికులు గెలిపించాలని పిలుపునిచ్చారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

హన్మకొండ అర్బన్: ఇటీవల మరణించిన వెటర్నరీ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మాదాజి కుటుంబ సభ్యులను తెలంగాణ వెటర్నరీ అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యవర్గ సభ్యులు సోమవారం పరామర్శించారు. ఈమేరకు రూ.50 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎం.రాము, కోశాధికారి టి.బాలాజీ, ఉపాధ్యక్షులు మురళీధర్‌రావు, గోపాల్‌రావు, రిటైర్డ్ వెటర్నరీ డాక్టర్స్ అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చంద్రమౌళి, రిటైర్డ్ జేడీ సుభాష్‌రెడ్డి పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వే

ఖిలా వరంగల్: వరంగల్ రైల్వేగేట్ ప్రాంతంలోని పలు డివిజన్లలో సమగ్ర కుటుంబ సర్వే కొనసాగుతోంది. ఇన్యుమరేటర్లు డివిజన్లలో సోమవారం ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. సర్వేకు ఒక్కో ఇంటికి 20 నిమిషాలకు పైగా సమయం పడితోంది. ప్రజలు పూర్తిస్థాయిలో సమాధానాలు చెప్పకపోవడంతో సర్వే ఆలస్యం అవుతుందని ఎన్యుమరేటర్లు వాపోయారు.

విద్యార్థులకు ఫెల్లోషిప్స్ అందించాలి

కేయూ క్యాంపస్: కేయూలో పరిశోధనలు చేసే ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఫెల్లోషిప్స్ ఇచ్చేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని డీవైఎఫ్ఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి తిరుపతి, సహాయ కార్యదర్శి చిరంజీవి కోరారు. ఈమేరకు కేయూకు వచ్చిన ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు వినతిపత్రం అందజేశారు.

పైడిపల్లిలో పోలీసుల కళాజాత

వరంగల్: డ్రగ్స్, గంజాయి, గుట్కా, మత్తు పదార్థాలపై వరంగల్ 3వ డివిజన్ పైడిపల్లి గ్రామంలో పోలీసు కళాబృందం సభ్యులు సోమవారం సాయంత్రం కళాజాత నిర్వహించినట్లు ఏనుమాముల పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఏ.రాఘవేందర్ తెలిపారు. ఎస్సై రాజు, కళాబృందం ఇన్‌చార్జ్ ఉమెన్ ఏఎస్సై నాగమణి, సభ్యులు, హెడ్‌కానిస్టేబుళ్లు విలియమ్, వెంకటేశ్వర్లు, రత్నయ్య, హోంగార్డులు శ్రీనివాస్, నారాయణ, విక్రం, రాజు, చిరంజీవి పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

రామన్నపేట: వరంగల్ మట్టెవాడ పోలీస్‌స్టేషన్ పరిధి ములుగురోడ్డులోని హనుమాన్ గుడి సమీపంలోని వంగ విజయ్‌కుమార్ ఇంట్లో పేకాటడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు. వారి వద్ద నుంచి రూ. 51770 తో పాటు ఏడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. అరెస్టు అయిన వారిలో కనుకుంట్ల నర్సింగం, పిట్టల ప్రభాకర్, ఆరెపల్లి పీటర్, అదుప విజయ్, వేల్పుల సురేందర్, తొగురు లక్ష్మణ్, సంగ కుమార్ ఉన్నారు.

హాస్టల్ వసతి కల్పించాలని వినతి

కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించాలని కళాశాల విద్యార్థులు కోరారు. ఈమేరకు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతికి సోమవారం వినతిపత్రం అందజేశారు.

మౌలానా అబుల్‌కలాంకు నివాళి



కేయూలో అబుల్‌కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వీసీ, రిజిస్ట్రార్, తదితరులు



బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో..



అబుల్ కలాంకు నివాళులర్పిస్తున్న జక్కలొద్ది గురుకులం ప్రిన్సిపాల్ భిక్షపతి, మతపెద్దలు



హసన్‌పర్తి: మౌలానా అబుల్‌కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్వాతంత్ర్య సమరయోధుడు, దేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్‌కలాం ఆజాద్ జయంతిని నగరంలో సోమవారం నిర్వహించారు. ఈమేరకు ఆయన చిత్రపటాలకు పలువురు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఆయన దేశానికి సేవలను కొనియాడారు.

- సాక్షి నెట్‌వర్క్

17న లారీ సప్లయర్స్ ఎన్నికలు



నామినేషన్లు స్వీకరిస్తున్న ఎన్నికల అధికారి

ఖిలా వరంగల్: వరంగల్ జిల్లా లారీ సప్లయర్స్ అసోసియేషన్ ఎన్నికల మొదటి ఘట్టం సోమవారం సాయంత్రం నామినేషన్ల స్వీకరణతో ముగిసింది. ఏడుగురితో కూడిన కార్యవర్గం ఏర్పాటుకు ఏడు నామినేషన్లు దాఖలయ్యాయి. బరిలో ఉన్న అభ్యర్థుల జాబితాను ఎన్నికల కమిటీ ప్రతినిధి మింగని సదానందం వెల్లడించారు. ఈసారి ఎన్నికలు ఏకగ్రీవం కానున్నాయి. అధ్యక్షుడిగా వంగాల సమ్మిరెడ్డి, ప్రధాన కార్యదర్శులు కొండా సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా సయ్యద్ హిమాయతుల్లా (బాబర్), సహాయ కార్యదర్శిగా మందాటి రవీందర్, కోశాధికారిగా దాసరి నాగరాజు, సభ్యులుగా బాసాని రామకృష్ణ, తాళ్ల కుమార్ పోటీ పడుతున్నారు. ఈనెల 17న వరంగల్ హంటర్ రోడ్డులోని లారీ సప్లయర్స్ అసోసియేషన్ భవనంలో కార్యవర్గం ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారులు ప్రకటించనున్నారు. సమావేశంలో ఎన్నికల కమిటీ ప్రతినిధులు తోట దేవేందర్, వెలిశాల శ్రీనివాస్, కందిమల్ల భాస్కర్‌రావు, ఇంజమూరి సూర్యనారాయణ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



సదస్సులో మాట్లాడుతున్న సతీష్ కుమార్

హన్మకొండ: విద్యార్థులు మాదక ద్రవ్యాలు, సైబర్ క్రైమ్‌లకు దూరంగా ఉండాలని హనుమకొండ పోలీసు ఇన్‌స్పెక్టర్ సతీష్ కుమార్ సూచించారు. హనుమకొండ నయీంనగర్‌లోని మోషన్ కళాశాలలో విద్యార్థులకు కెరియర్ గైడెన్స్‌పై సోమవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్, గంజాయికి బానిస అయితే జీవితాలు నాశనం అవుతాయని హెచ్చరించారు. సమయం చాలా విలువైనదని, దాన్ని వృథా చేయకుండా విద్యార్థులు ఒక ప్రణాళిక ప్రకారం కష్టపడి చదివితే ప్రయోజకులు అవుతారని వివరించారు. కార్యక్రమంలో మోషన్ కళాశాల చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్, ప్రిన్సిపాల్ ముత్యాల సురేష్, ఏఓ మురళి తదితరులు పాల్గొన్నారు.